వీరూ భక్తులే కాని వీరు నిష్కామ భక్తులు. వీరికి జ్ఞానం తప్ప ఏమీ అక్కరలేదు. శ్రవణభక్తి ఈశ్వరానుభవం పొందటానికి మీ మనస్సుకి మృదుత్వం తీసుకొని వస్తుంది, మనస్సు పల్లబడేటట్లు చేసి మనస్సుకు తియ్యదనం కలుగజేస్తుంది. రామనామం చేసేటప్పుడు యాంత్రికంగా చేయకూడదు. మనస్సు అక్కడ పెట్టి చెయ్యాలి, ప్రేమగా చెయ్యాలి. మనం చేసిన మంచిగాని, మనం చేసిన సాధన గాని వృధాపోదు. అది రాబోయే జన్మలలో మనకు సహకరిస్తుంది. అన్నీ ఉండి కూడా మనం అణిగి ఉంటే రామానుగ్రహానికి పాత్రులవుతాము. నీవు త్రికరణశుద్ధిగా చేస్తే ఒక్క రామనామం చాలు నిన్ను అమృత స్థితికి తీసుకొనిపోతుంది.

ప్రతీ మనిషి ఏదో వాసనతో పుడతాడు. ఏవాసన లేకపోతే వాడికి దేహంతో పనిలేదు. మనకు ఏ వాసన ఉందో ఆవాసన తొలగించుకొంటే జ్ఞానులు అవుతాము. కాని మనం ఆ వాసనకు అనుగుణంగా జీవించి ఆవాసనను పెంచుకొని మరల పునర్జన్మలకు పోతాము. జీవుడు నా అంశ అని భగవంతుడు గీతలో చెప్పాడు. అందువలన జీవుడిని గౌరవిస్తే భగవంతుడు సంతోషపడతాడు. రామనామం వలన నీకు ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది, మనో నిగ్రహం కలుగుతుంది, బాహ్యమైన ఆకర్షణలు తగ్గిపోతాయి. ఎక్కువ శ్రమ పడకుండా మోక్షం అనే ఒడ్డుకు చేరుకొంటాము. రామనామం విలువ, శక్తి తెలియక మీరు రామనామం చేయటంలేదు దాని విలువ తెలిస్తే రామనామం చేయకుండా ఎలా ఉండగలరు అంటున్నాడు రామదాసు. సంసారంలో ఎన్నికష్టాలు వచ్చినా నీకు భయం ఎందుకు? రామనామం ఉండగానీకుభయం ఏల అంటున్నాడు రామదాసు. నీ కళ్ళకు కనిపించే ప్రపంచం అసత్యం రాముడు సత్యం నీవు ఏమీఅనుకుంటున్నావు అంటే ప్రపంచం సత్యంఅనుకొంటున్నావు రాముడు అసత్యం అనుకొంటున్నావు దీనికి నీలోఉన్న రజోగుణం కారణం. ఉన్నది ఒకటే వస్తువు. అదిమనకు అనేకంగా కనిపిస్తోంది దీనికి మనలోఉన్న రజోగుణమే కారణం. అందువలన రజోగుణాన్ని తగ్గించుకోవాలి. సత్వగుణాన్ని అలవర్చుకోవాలి. మనకు జ్ఞానంకలగటానికి సత్వగుణం సహకరిస్తుంది. మీకు ఏదైనా గౌరవం వచ్చింది అనుకోండి అక్కడ ఏదో మంచి పని చేసాము వచ్చింది అనుకోవద్దు. అది రాముని ప్రసాదం అనుకోండి. మీకు గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా రాముని ప్రసాదం అనుకోండి అప్పుడు మీ బుద్ధి సమానంగా ఉంటుంది. రామనామం నీ మనస్సు అణగటానికి సహకరిస్తుంది, రామనామం నీ మనస్సును కత్తిరిస్తుంది. భగవంతుని నామం మీద నీకు పూర్తి విశ్వాసం ఉంటే సంసారంలో ఎన్ని కష్టాలు వచ్చినా నీ మనస్సు చలించదు. అందువలన రామనామమును విడిచిపెట్టవద్దు.